
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 27 అక్టోబరు 2024





కిలిమంజారో పర్వతంపై టీచర్ విజయలక్ష్మి



పవర్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాన్ని అందుకున్న తేజస్విని

సండే స్పెషల్
SUNDAY SPECIAL

అతివల అధిరోహణ

- పర్వతారోహణలో టీచర్ విజయలక్ష్మి
- పవర్‌వెయిట్‌లిఫ్టింగ్‌లో విద్యార్థిని తేజస్విని
- ఎత్తయిన కొండలు ఎక్కడంలో ఒకరు, బరువు ఎత్తడంలో మరొకరి ప్రతిభ

ప్రతీ రంగంలో పురుషులతో సమానంగా మహిళలు ప్రతిభ చాటుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు ఇతర క్రీడా, సాహసాల్లో తాము కూడా ఉన్నామంటూ భాగస్వాములవుతున్నారు. ఒకప్పుడు పురుషులు మాత్రమే చేయగలరని భావించిన పర్వతారోహణ, వెయిట్‌లిఫ్టింగ్‌లో కూడా తామేం తీసిపోలేమని నిరూపిస్తున్నారు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు. ఒకరు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి అయితే, మరొకరు తేజస్విని విద్యార్థిని. ఐదుపదుల వయసులో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు వెళ్లివచ్చిన విజయలక్ష్మి భర్త సహకారంతో ఆరు వేల అడుగుల ఎత్తు ఉన్న అకాన్‌కాగ్వా పర్వతాన్ని ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు. తేజస్విని చదువును కొనసాగిస్తూనే పవర్‌వెయిట్‌లిఫ్టింగ్‌లో 120 కిలోల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో ఎప్పటికైనా ప్రతిభ కనబరిచేందుకు సాధన చేస్తోంది. లక్ష్యాల అధిరోహణలో ఉన్న ఇద్దరు మహిళలపై ప్రత్యేక కథనాలు...

●6లో..



ఓపీఎస్‌తోనే
భద్రత

ఆంధ్రజ్యోతి జన వాక్యం

- సీపీఎస్‌ను వెంటను రద్దు చేయాలి
- కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలుచేయాలి
- ఉద్యోగ విరమణ అనంతరం భరోసా కల్పించాలి

ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం 2004లో తెచ్చిన సీపీఎస్ (కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం)తో ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌తో సంబంధం ఉన్న సీపీఎస్‌కు బదులు ఉద్యోగ విరమణ అనంతరం చివరి వేతనంలో 50శాతం పెన్షన్‌గా వచ్చే ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా వెంటనే సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను కొనసాగించాలని కోరుతున్నారు. సీపీఎస్, ఓపీఎస్‌పై నేటి జనవాక్యంలో పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు వెలిబుచ్చిన అభిప్రాయాలు..

●7లో..

దీపావళికి టపాసులు రెడీ



- ఇప్పటికే దుకాణాల ఏర్పాటు
- అనుమతులు తప్పనిసరి

వెలుగుల పండుగ దీపావళి రోజున బాణసంచా కాల్చడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే టపాసుల దుకాణాలు వెలిశాయి. అయితే తాత్కాలికంగా ఏర్పాటుచేసే ఈ దుకాణాలకు అనుమతులు తప్పనిసరి. అంతేగాక దుకాణాల ఏర్పాటు, టపాసులను కాల్చడంలో జాగ్రత్తలు తీసుకుంటేనే ఆనంద దీపావళి అవుతుంది. కాగా, ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 217 దుకాణాల ఏర్పాటుకు మాత్రమే నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే పండుగ మరో ఐదు రోజులు ఉండగా, ఇప్పటికే కొందరు బహిరంగ ప్రదేశాల్లో టపాసులను విక్రయిస్తున్నారు. వీరంతా అనుమతులు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

– (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్, నల్లగొండ, సూర్యాపేట క్రైం)

బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. బాణసంచా విక్రయాలకు శాశ్వత అనుమతులు ఉండగా, సంవత్సరంలో 15 రోజుల పాటు విక్రయాలకు తాత్కాలిక అనుమతులను అధికారులు ఇస్తుంటారు. ఈ మేరకు యాదాద్రి జిల్లాలో భువనగిరిలో మూడు, చౌటుప్పల్‌లో 2, మోత్కూరులో 1 శాశ్వత బాణసంచా విక్రయాల దుకాణాలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో శాశ్వత దుకాణాలు 14 ఉన్నాయి. వీటి యజమానులు ఏటా రూ.2వేల ఫీజు చెల్లించి అనుమతులను రెన్యువల్ చేసుకుంటారు. అయితే తాత్కాలిక అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీపావళి సీజన్‌లోనే తాత్కాలిక అనుమతులకు ఎక్కువగా దరఖాస్తులు వస్తుంటాయి.ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌లో fire.teagana.gov.inలో రూ.500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు. అయితే అగ్నిమాపకశాఖ అధికారులు జారీ చేసే అనుమతుల ఆధారంగా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఆధారంగా పోలీసు అధికారులు క్షేత్రపరిశీలన చేస్తారు. అన్ని సక్రమంగా ఉంటే ఎన్‌వోసీ జారీ చేస్తారు. ఆ రెండు ఎన్‌వోసీల ఆధారంగా స్థానిక సంస్థల అధికారులు మరోమారు క్షేత్రపరిశీలన చేసి ఎన్‌వోసీ ఇస్తారు. మూడు శాఖల అనుమతులు పొందాకే విక్రయాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ అనుమతులు 15 రోజులకు మాత్రమే వర్తిస్తాయి. యాదాద్రి జిల్లాలో తాత్కాలిక దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 42 దరఖాస్తులు రాగా, 12 దరఖాస్తులను అగ్నిమాపకశాఖ తిరస్కరించింది. మిగతా దరఖాస్తులు పరిశీలన స్థాయిలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 128 తాత్కాలిక దుకాణాలకు అధికారులు లైసెన్స్ జారీచేశారు. సూర్యాపేట జిల్లాలో దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించేందుకు జిల్లాలోని పోలీస్, మునిసిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులకు ఇప్పటి వరకు 70 దుకాణాలకు తాత్కాలిక అనుమతులు పొందేందుకు ధరఖాస్తులు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 36, కోదాడలో 26, హుజూర్‌నగర్‌లో 8 దుకాణాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయి. కాగా కొంతమంది ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేయగా, వారిని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలని అధికారులు సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోదాడలోని రాంమూర్తినగర్‌లో, హుజుర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ పక్కన ఖాళీ స్థలంలో అనుమతులు పొందిన నిర్వాహకులు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.



- ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 217 దరఖాస్తులు

నిబంధనలు ఇలా..

శాశ్వత బాణసంచా దుకాణాలు కచ్చితంగా పట్టణాలు, గ్రామాల వెలుపలే ఉండాలి. తాత్కాలిక దుకాణాలు బహిరంగ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రతీ దుకాణంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నియంత్రణకు వినియోగించే ఉపకరణాలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలి. తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసే ఖాళీ స్థలాలు ప్రభుత్వ భూములైతే సంబంధిత శాఖల అధికారుల అనుమతులు, ప్రైవేట్ స్థలాలు అయితే..

– మిగతా 6వ పేజీలో...

సారు మార్చేశారు

- నాణ్యమైన విద్యే లక్ష్యం
- బోయవాడ యూఆర్‌ఎస్‌పై కలెక్టర్ ఫోకస్
- నెల వ్యవధిలో మార్పు తెచ్చిన కార్యాచరణ


నల్లగొండ యూఆర్‌ఎస్‌లో గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కలెక్టర్‌కు సర్కార్ బడుల విలువ తెలుసు. శిక్షణ పొందిన, అర్హతలున్న ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం ఆయనకు అనుభవమే. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ గురుకులాల్లో చదువు, భోజనం, వసతులు, వనరుల కల్పనకు ప్రభుత్వం ఎంతో వెచ్చిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అసౌకర్యాలు, అరకొర వసతులు ఆయన్ను కలచివేశాయి. ఈ విధానాన్ని మార్చాలనే పట్టుదలతో కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా కేంద్రంలోని బోయవాడ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్‌ఎస్)పై దృష్టి సారించారు. సరిగ్గా నెల రోజుల క్రితం ఆ పాఠశాల సందర్శించి, విద్యార్థుల మొర ఆలకించిన ఆయన,ఆ రోజు తన దృష్టికి వచ్చిన సమస్యలనీ పరిష్కరించారు. నాడు అన్నీ సమస్యలే కనిపించిన పాఠశాలలో శనివారం కలెక్టర్ పర్యటన రోజుకు పూర్తిగా మార్పు సంతరించుకుంది.బోయవాడ యూఆర్‌ఎస్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి సెప్టెంబరు 24న తనిఖీ చేయగా, కిచెన్ సరిగా లేకపోవడం, మెనూ పాటించకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం, గదులు పెచ్చులూడిపోవడం, గోడలు మాసిపోయి ఉండడం, తాగునీరు లేకపోవడం, ఫ్యాన్లు పని చేయకపోవడం, పిల్లలకు దుప్పట్లు లేకపోవడం, బెంచీల కొరత, పుస్తకాలు, నోట్ బుక్కులు లేకపోవడం, దోమల బెడద, మురుగునీరు పాఠశాల ఆవరణలోనే లీకవడం వంటి సమస్యలన్నీ విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలలో ఈ పరిస్థితి ఉండటంపై విద్యాశాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశించడంతో పాటు నిధులు మంజూరు చేశారు. అంతేగాక పనులు పూర్తయ్యేంతవరకు ప్రతీ రోజు పరిశీలించి తనకు నివేదించాలని క్యాంప్ క్లర్క్‌ను ఆదేశించారు. అంతే.. నెల రోజుల గడువులో ఈ పాఠశాల గదుల మరమ్మతులు, విద్యుత్ సదుపాయంతో పాటు, కొత్త ఫ్యాన్లు, బెంచీలు సమకూరాయి. మరుగుదొడ్లకు మరమ్మతులతోపాటు, మురుగునీరు లీక్ కాకుండా చేశారు. గోడలకు రంగులు వేయడంతో పాటు కిటికీలు అమర్చారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు ఇచ్చారు. వంటగదిని శుభ్రం చేయించి మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. శనివారం తిరిగి ఈ పాఠశాలను తనిఖీచేసి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలన్నింటినీ తీర్చారని, బాగా బోధించడంతో పాటు చక్కటి ఆహారం పెడుతున్నారని, నీటి కొరత తీరిందని పేర్కొంటూ విద్యార్థులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేట్‌కి దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కలెక్టర్ నారాయణరెడ్డి

పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించడమే మా ఏకైక లక్ష్యం. ప్రభుత్వం అందించే వసతులు, సదుపాయాలు విద్యార్థులకు సక్రమంగా అందించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. బోయవాడ యూఆర్‌ఎస్‌లో నెలలోపు సమస్యలన్నీ పరిష్కరించినందుకు విద్యాశాఖ అధికారులను అభినందిస్తున్నా. ఈ సదుపాయాలన్నీ సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదవి ఉన్నతంగా ఎదగాలి.

మూసీ ప్రక్షాళన పరివాహక ప్రజల ఆకాంక్ష

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి మూసీ పునరుజ్జీవ ప్రజాచైతన్య యాత్ర
- ఎంపీ చామల, ఎమ్మెల్యే వీరేశం మద్దతు



మూసీ పునరుజ్జీవ ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన పరివాహక ప్రజల జీవితకాలపు ఆకాంక్ష అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమానికి మద్దతుగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా సరిహద్దు గ్రామాలు మక్తానంతారం, పిలాయిపల్లి వద్ద నుంచి మూసీ పునరుజ్జీవ ప్రజాచైతన్యయాత్రను చేపట్టారు.ఆయకట్టు గ్రామాల ప్రజలు, కార్యకర్తలతో కలిసి మూసీ బ్రిడ్జి మార్గం గుండా మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. అనంతారం కత్వ వద్ద ప్రజలతో కలిసి కలుషితపు నీటిని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ప్రవహించిన మూసీ నది ఇక్కడి ప్రజలకు జీవనదిగా, ఆదెరువుగా ఉండేదన్నారు. అలాంటి నది కాలక్రమేణ విషతుల్యంగా మారి ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఆయకట్టు ప్రజల భవిష్యత్ భావితరాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రక్షాళన చేసి పూర్వస్థితికి తీసుకురావాలనే పునరుజ్జీవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మూసీ ప్రక్షాళనకు ఆయకట్టు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం

కమీషన్లు దండుకోవడం కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. రూ.30వేల కోట్ల ప్రాజెక్టు అంచనాలను రూ.లక్షన్నర కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవడం నిజంకాదా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను తప్పుడు ప్రచారాలతో అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే ...

మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి మంచిపేరు వస్తుందని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అవినీతి మరకలు అంటించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం ప్రాజెక్టులు నిర్మించిందన్నారు. మూసీకి పూర్వవైభవం తీసుకువస్తే హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరివాహక ప్రజల జీవితాలలో పెనుమార్పులు వస్తాయన్నారు. పోచంపల్లి, బీబీనగర్ మండలాల్లో జరిగిన ఆయాకార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి,మేడ్చల్‌మల్కాజిగిరి నియోజకవర్గ నాయకులు సుధీర్‌రెడ్డి, వజ్రేశ్ యాదవ్, మూసీ పరిరక్షణ సమితి నాయకులు బట్టి శంకర్, లింగంయాదవ్, రామాంజనేయులుగౌడ్, గోళి పింగల్‌రెడ్డి, పొట్టోళ్ల శ్యాంగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, పోత్నక్ ప్రమోద్‌కుమార్, రవికుమార్, నాయకులు సురకంటి సత్తిరెడ్డి, నరేందర్ రెడ్డి, గడ్డం బాలకృష్ణగౌడ్, పెంటయ్యగౌడ్, ఆగమయ్యగౌడ్, బస్వయ్య, అచ్చయ్యగౌడ్, బాల్‌రెడ్డి, శ్యాం, ప్రభాకర్, మర్రి నర్సింహారెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, భారత లవకుమార్, తడక రమేష్, అంబరీష్‌రెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అందెల లింగంయాదవ్, ఉప్పునూతల వెంకటేష్‌యాదవ్, అనిరెడ్డి జగన్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను పరిశీలించిన ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు


నందికొండ మునిసిపాలిటీలో ట్రైనీ అధికారులు

నాగార్జునసాగర్, దేవరకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సాగర్ బీసీ గురుకులంలో భోజన వసతి, మునిసిపాలిటీ, మీ-సేవా కేంద్రాల్లో అందుతున్న సేవల గురించి ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు శనివారం సాగర్‌ను సందర్శించారు. దేవరకొండ మున్సిపాలిటీలో అధికారులతో సమావేశమయ్యారు. సాగర్‌లో డంపింగ్ యార్డును, సాగర్ ప్రధాన డ్యాంను సందర్శించారు. కార్యక్రమంలో కునలు గురు రాణి(ఐఆర్‌ఎస్), అభిషేక్ రాజన్(ఐపీఎస్), రష్మీ సీటోలే(ఐఈఎస్), పాయల్ మీనా(ఐఏఎస్), తదితరులు పాల్గొన్నారు. వారి వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి

ఎస్పీ శరత్‌చంద్రపవార్


అమరవీరుల ర్యాలీలో బైక్ నడుపుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్


నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని అమరులు స్థూపం నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్ టవర్, ప్రకాశంబజార్, డీఈవో ఆఫీస్ మీదుగా క్లాక్ టవర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అమరుల త్యాగాలు స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన పోలీసులకు ఆత్మశాంతి కలగాలన్నారు. ప్రతీ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాఘవరావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్, సైదులు, నాగరాజు, కొండల్ రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, సూరప్పనాయుడు పాల్గొన్నారు.


సన్నధాన్యం కొనుగోలుకు 80 కేంద్రాలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్


ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సన్నధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 80 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అన్ని కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం రాశులను పరిశీలించి తేమ శాతాన్ని తెలుసుకున్నారు. కేంద్రానికి నేటి వరకు ఎంత ధాన్యం వచ్చిందో ఇన్‌చార్జి చిక్కుళ్ల వెంకన్నను అడిగి తెలుసుకున్నారు. కాగా, జిల్లాలో నేటి వరకు రైతుల నుంచి 2,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. ఆయన వెంట డీసీఎస్‌వో వి.వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, ఆర్ఐ లింగస్వామి, తదితరులు ఉన్నారు.





సూర్యాపేట జిల్లా అర్వపల్లి సమీపంలోని గుట్టలు చెట్లపొదలతో ఆకుపచ్చదనంతో ఉట్టిపడుతున్నాయి. పదేళ్లుగా లేని వర్షాలు కురవడంతో గుట్టలనిండా మొక్కలు పెరిగి పచ్చదనం పెరిగింది. కొండల మధ్య ఉన్న రాళ్లు కనపడకుండా ఆకులు మాత్రమే కనపడుతున్నాయి. లోయపల్లి వద్ద కొండ పక్కన వ్యవసాయ క్షేత్రాలు ఉండడం మరింత శోభను తెచ్చింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో గుట్టల్లో జింకలు, నెమళ్లలను, పక్షులను పెంచుతున్నారు. అటు పర్యావరణం, ఇటు జంతురక్షణకు నిలయంగా ఈ ప్రాంతం విలసిల్లుతోంది.
(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీ విజేతలుగా నల్లగొండ విద్యార్థులు


విజేతలకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెడ్ రిబ్బన్ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో నల్లగొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సీహెచ్.అభిలాష్, కే విశాల్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూసుఫోద్దీన్ ఆధ్వర్యంలో విజేతలతో డీఈవో భిక్షపతిని కలిశారు. డీఈవో వారిని మెమొంటోలు, ప్రశంసాపత్రాలు, రూ.8వేల నగదును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ రామచంద్రయ్య, సీనియర్ ఉపాధ్యాయులు అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ నేవి అగ్నివీర్‌కు ఐదుగురు ఎంపిక


అగ్నివీర్‌కు ఎంపికైన విద్యార్థులతో అకాడమీ నిర్వాహకులు

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అగ్నివీర్ ఉద్యోగాలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని అన్నెపర్తి సమీపంలోని రామయ్య డిఫెన్స్ అకాడమీకి చెందిన ఐదుగురు విద్యార్థులు జులైలో నిర్వహించిన జాతీయ స్థాయిలో పరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా శనివారం రామయ్య డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్స్ రామయ్య, శ్రీనివాస్ నేవి అగ్నివీర్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నగేష్, బొమ్మ శంకర్ పాల్గొన్నారు.

పట్టుదలతో 'విజయ' శిఖరాలకు





పట్టుదల, సంకల్పం ఉంటే వయస్సు అడ్డంకి కాదని, అనుకున్నది సాధించవచ్చని నిరూపిస్తున్నారు నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కర్రా విజయలక్ష్మి. వేలమీటర్ల ఎత్తులో ఉన్న పర్వతాలను అవలీలగా అనేకసార్లు అధిరోహించి భళా అనిపించుకున్నారు. మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఐదు పదుల వయసులో ఆమె ప్రపంచంలోని ఎత్తైన నాలుగు పర్వతాలను అధిరోహించి స్ఫూర్తిగా నిలిచా రు. పర్వతారోహణకు శిక్షణ లేకుండా కేవలం సొంత అవగాహనతో అనుకున్నది సాధించి అబ్బురపరుస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

- చిన్నతనం నుంచే పర్వతారోహణపై ఆసక్తి
- రుదుగైరా, కిలిమంజారో పర్వతాలను అధిరోహించిన విజయలక్ష్మి
- భర్తతో కలిసి ఎల్‌బ్రస్, ఎవరెస్టు బేస్ క్యాంప్ వరకు
- ఐదు పదుల వయసులోనూ సాహసం

పర్వతారోహణ అంటే ఇష్టమున్న చాపల విజయలక్ష్మి ప్రస్తుతం దేవరకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త వెంకట్ రెడ్డి నిడమనూరులో రియల్ ఎస్టేట్ తదితర వ్యాపారాలు చేస్తుంటారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడం ఆమె వృత్తి అయినప్పటికీ తన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూనే మరోవైపు ఖాళీ సమయాల్లో పర్వతారోహణ చేయడం ఆమెకు ఉన్న హాబీల్లో ఒకటి. చిన్నప్పుడు ఆమె కుటుంబం నల్లగొండలో ఉండేది. అప్పుడు నల్లగొండలోని లతీఫ్‌సాబ్, కాపురాల గుట్టలను తరుచూ ఎక్కుతుండేవారు. అప్పుడే ఆమెకు పర్వతారోహణపై ఆసక్తి పెరిగింది. దీంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించాలనేది కలగా ఉండేది. పెళ్లి అయినా, ఉద్యోగం చేస్తున్నా పర్వతారోహణపై ఇష్టంపోలేదు. దీంతో తోటి ఉపాధ్యాయుల ద్వారా పర్వతారోహణ చేయించే సంస్థల గురించి తెలుసుకునేది. యూట్యూబ్ సాయంతో పర్వతారోహణపై కొంత అవగాహన ఏర్పరుచుకుంది. పర్వతారోహణ చేయాలనే తన సంకల్పం గురించి భర్తకు చెప్పగా ఆయన సహకారం అందించారు.

దీంతో మొదటిసారిగా 2020 సెప్టెంబరులో ఉత్తరాఖండ్ లోని 5,200 మీటర్ల ఎత్తులో ఉన్న రుదుగైరా పర్వతాన్ని అధిరోహించారు. అనంతరం దక్షిణాఫ్రికాలోని 5,895 మీటర్ల ఎత్తులో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని 2021 సెప్టెంబరులో అధిరోహించారు.

ఈ రెండు సాహసయాత్రలను ఒంటరిగా విజయవంతంగా పూర్తిచేసింది. ఆ తర్వాత రష్యా దేశంలోని 5.642 మీటర్ల ఎత్తులో ఉన్న ఎల్‌బ్రస్ పర్వతాన్ని 2022 ఆగస్టు 15న భర్తతో కలిసి అధిరోహించి శిఖరాగ్రంపై భారత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం 2023 మేలో నేపాల్‌లోని 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్టు బేస్ క్యాంప్ వరకు భర్తతో కలిసి చేరుకుంది. ఇదే ఒరవడితో త్వరలో 6,961 మీటర్ల ఎత్తులో ఉండే దక్షిణ అమెరికాలోని అకాన్‌కాగ్వా పర్వతాన్ని అధిరోహించేందుకు సిద్ధమవుతున్నారు. పట్టుదల, సంకల్పం ఉంటే వయసుతో సంబంధం లేకుండా అనుకున్న లక్ష్యాలను అవలీలగా సాధించవచ్చని నిరూపిస్తున్నారు. జీవితంలో ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరడమే విజయలక్ష్యంగా పెట్టుకున్నారు.


ఎల్‌బస్ పర్వతంపై విజయలక్ష్మి, వెంకట్‌రెడ్డి

చిన్నప్పటి కలను నెరవేర్చుకున్న



ప్రపంచంలోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించాలని చిన్నప్పటి నుంచి నాకు కలగా ఉండేది. పట్టుదల, సంకల్పం, కృషితో పలు పర్వతాలను అధిరోహించి కలను నెరవేర్చుకున్నా. పర్వతారోహణ చేయడం కష్టమే అయినప్పటికీ నాకున్న ఆసక్తితో ఎలాంటి ఒడిదుడుకులు, ఇబ్బందులు ఎదురుకాలేదు. వయసు గురించి ఆలోచన కూడా చేయకుండా గమ్యం చేరుకున్నా. లక్ష్యం సాధించాలనే తపనతో, నాభర్త సహకారంతో యాత్రలు విజయవంతంగా పూర్తిచేశా. త్వరలో దక్షిణ అమెరికాలోని మౌంట్ అకాన్‌కాగ్వా యాత్రకు సిద్ధమవుతున్నా.
- కర్రా విజయలక్ష్మి

పవర్‌వెయిట్‌లిఫ్టింగ్‌లో దిట్ట తేజస్విని

▸ రాష్ట్రస్థాయి బంగారు పతకం ▸ తొలి ప్రయత్నంలోనే విజేత ▸ ఐపీఎస్ లక్ష్యమంటున్న క్రీడాకారిణి

అవకాశం లభిస్తే మహిళలు ఏ రంగంలోనైనా ప్రతిభను సాధించగలరు, తమ శక్తి, సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను చేరుకోగలరని నిరూపిస్తున్నారు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన కందుల తేజస్విని. ఓ వైపు చదువుతూనే ప్రత్యేకంగా శిక్షణ పొందుతూ తానకు ఇష్టమైన పవర్‌వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణిస్తూ పలువురితో భేష్ అనిపించుకుంటున్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారని నిరూపిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందీ తేజస్విని.
- (ఆంధ్రజ్యోతి- నల్లగొండ)



నల్లగొండ జిల్లా కేంద్రానికి కందుల వెంకటరమణగౌడ్-భార్గవి దంపతుల ప్రథమ కుమార్తె కందుల తేజస్వీని. ఐపీఎస్ కాలనే లక్ష్యంతో హైదారాబాద్ లోని ఒక ప్రైవైటు కళాశాల ఐపీఎస్ అకాడమీలో చేరింది. ఓ వైపు చదువు కుంటునే మరో పక్క క్రీడలపై ఆసక్తి పెంచుకొని పవర్‌వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో ప్రతిభ కనబరుస్తోంది. తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇటీవల వరల్డ్ పవర్ వెయిట్‌లిఫ్టింగ్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక జిమ్‌లో అంతర్ జిల్లాల అండర్-19 పవర్‌లిఫ్టింగ్ 120 కిలోల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని అందుకుంది. వివిధ కేటగిరిల్లో బరువు, వయస్సు ఆధారంగా జరిగిన ఈ పోటీల్లో 50 మంది అమ్మాయిలు పోటీపడ్డారు.. 120 కిలోల విభాగంలో తేజస్విని అత్యుత్తమ ప్రతిభతో విజేతగా నిలిచింది. అదే విధంగా మరోక రాష్ట్రస్థాయి పోటీల్లో 125 కిలోల విభాగంలోనూ పతకం సాధించింది. తన విజయాలతో ఇతర అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. తండ్రి వెంకటరమణగౌడ్ వెయిట్ లిఫ్టర్ కావడంతో కుమార్తె తేజస్విని ఆసక్తిని గమనించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అంతే కాకుండా రఘు కోచ్ సారథ్యంలో పవర్‌వెయిట్ లిఫ్టింగ్‌లో మేళకువలు నేర్చుకుని ఆటలో పూర్తిగా ఆరితేరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన ఉత్సాహంతో జాతీయ స్థాయి పవర్ వెయిట్ లిఫ్టింగ్ 110 కిలోల విభాగంలో తేజస్విని బంగారు పతకం సాధధించింది.

నల్లగొండ జిల్లా కేంద్రలోని హైదరాబాద్ రోడ్‌లోని జిమ్‌లో నిరంతరం సాధన చేస్తోంది. జిమ్‌లోనే ఎక్కువ సమయం గడుపుతూ శిక్షణ పొందుతోంది. వివిధ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన తేజస్విని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌లు అభినందించారు.


తేజస్విని అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలుస్తా



రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పవర్‌వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో పతకం అందుకోవడం సంతోషంగా ఉంది. అదే స్ఫూర్తితో మరింత పట్టు సాధించేందుకు నిరంతరం సాధన చేస్తున్నా. తల్లితండ్రులు, కోచ్ ల తర్ఫీదుతో మరిన్ని పతకాలు సాధిస్తా. జాతీయస్థాయిలో పతకం సాధించేందుకు సాధన చేస్తున్నా. సోషల్ మీడియాలో పవర్‌వెయిట్ లిఫ్టింగ్ క్రీడ నన్ను ఆకర్షించింది. వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖ, కోశాధికారి విజయ ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నా. క్రీడలతో పాటు ఐపీఎస్ సాధించాలనేదే నా లక్ష్యం.
- తేజస్విని, పవర్‌వెయిట్‌లిఫ్టర్

సాగర్‌లో కొనసాగుతున్న
నీటి విడుదల

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు రెండు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు 2 జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ఉత్పత్తి చేస్తూ, అలాగే 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి 1,22,234 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.50 అడుగులు(310.5510టీఎంసీలు)గా ఉంది. కుడి కాల్వ ద్వారా 10,200క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,173క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,597క్యూసెక్కులు,ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లలో 2క్రస్ట్‌గేట్లను 5అడుగులు ఎత్తి 16,096 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 64,866 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 911.10 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు 3 నెంబర్ గేటును అడుగు మేర ఎత్తడం ద్వారా 649.41 క్యూసెక్కులు, లీకేజీలు, ఆవిరి రూపంలో వెళ్తున్న 53.35క్యూసెక్కుల నీరు కలిసి మొత్తం 702.76క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. 645అడుగులు(4.46టీఎంసీ)ల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.80అడుగులు(4.15టీఎంసీ)లుగా ఉంది.

పులిచింతలలోనూ ...

ఉభయ తెలుగురాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు రెండుగేట్ల ద్వారా 28,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 173.52(43.49టీఎంసీలు)అడుగులుగా ఉంది. ఎగువనుంచి 43,075 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం నుంచి 16,000 క్యూసెక్కుల నీటిని విడుదలచేయగా, మొత్తం ప్రాజెక్టులో అవుట్‌ఫ్లో 44.222గా నమోదైంది.

దీపావళికి టపాసులు రెడీ


నల్లగొండలో టపాసుల కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

యజమానుల లిఖితపూర్వక అంగీకార పత్రాలు ఉండాలి. అగ్ని ప్రమాదాలకు దోహదపడే ఎలాంటి పదార్థాలు, వస్తువులు, దుకాణాల్లో ఉండరాదు. అలంకరణ సామగ్రిని వినియోగించరాదు. ఒక్కో దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. దుకాణాల ఏర్పాటుకు డెకరేషన్ క్లాత్ వినియోగించకూడదు. మైక్‌సౌండ్స్, మితిమీరిన లైటింగ్ ఏర్పాటు చేయరాదు. దుకాణాల సమీపంలో బాణాసంచా కాల్చరాదు.

పేటలో ముడుపులు, చక్రం తిప్పుతున్న హోల్‌సేల్ డీలర్

దీపావళి పండుగకు బాణసంచా విక్రయించే దుకాణాల అనుమతులకు పేటలో భారీగా ముడుపులు వివిధ శాఖల అధికారులకు చెల్లిస్తున్నట్లు సమాచారం. తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు పోలీస్, మునిసిపల్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే ఒక్కో దుకాణానికి అనుమతి ఇచ్చేందుకు ఆయా శాఖల అధికారులకు రూ.15నుంచి రూ.20వేల వరకు ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, జిల్లా కేంద్రానికి చెందిన ఓ హోల్‌సేల్ డీలర్ అతడి వద్ద బాణసంచా కొనుగోలు చేసిన వారికే అనుమతులు వచ్చేలా చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. గతంలో జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు జనసంచార ప్రదేశాల్లో పట్టణానికి చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి పెద్దఎత్తున బాణసంచా నిల్వచేయడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. అయినా పట్టణంలో చాలా ప్రదేశాల్లో బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం. బాణాసంచా దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడటంతో ప్రజలపై ఆర్థికభారం పడు తోంది. రూ.10ఉన్న టపాసులను దుకాణదారులు రూ.30గా విక్రయిస్తున్నారు. దుకాణాల అనుమతులు, ఏర్పాటు కోసం భారీగా డబ్బు చెల్లించడంతో ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

11 ఏళ్ల క్రితం భువనగిరిలో
ముగ్గురు మృతి

భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌లో 11 ఏళ్ల క్రితం జనావాసాల మధ్య ఉన్న ఓ ఇంటిలో నిల్వ చేసిన బాణాసంచా పేలి ముగ్గురు మృతి చెందారు. ఇళ్లు భస్మీపటలం అయ్యాయి. దీపావళి పండుగ విక్రయాల కోసం తెచ్చిన స్టాక్‌ను సంబంధిత వ్యాపారి ఆ ఇంటిలో నిల్వ చేశాడు. కానీ, అనుమతులు తీసుకోకపోగా, ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదు. దీంతో దీపావళికి రెండు రోజుల ముందుగా అర్థరాత్రి ఆ ఇంటిలో నిల్వ చేసిన బాణాసంచా అకస్మాత్తుగా పేలడంతో అదే ఇంటిలోని పక్క గదిలో ఉంటున్న ముగ్గురు సజీవదహనమయ్యారు.దీంతో అప్పటివరకు పట్టణంలో ఉన్న బాణాసంచా దుకాణాలను అధికారులు శివారు ప్రాంతానికి తరలించారు.

అనుమతులు తీసుకోవాల్సిందే



బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. దుకాణాల నిర్వాహణలో ఏ మాత్రం అజాగ్రత్త చూపినా పెను ప్రమాదం జరుగుతుంది. అందుకు నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. జిల్లా అంతటా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం. ఇళ్లలో విక్రయించినా, జనావాసాల మధ్య ఉండే కిరాణ, తదితర దుకాణాల్లో విక్రయించినా కేసులు నమోదు చేస్తాం.
ఎం.రాజేష్ చంద్ర, డీసీపీ యాదాద్రి జిల్లా

నిబంధనల మేరకే అనుమతులు

జిల్లాలో బాణాసంచా విక్రయాలకు సంబంధించి అన్ని నిబంధనల మేరకే అనుమతులు ఇస్తున్నాం. జనావాసాల మధ్య విక్రయ కేంద్రాలకు అనుమతి లేదు. తాత్కాలిక లైసెన్స్ దారులు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తెలియజేశాం. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.
● సందేశ్ కుమార్, నల్లగొండ జిల్లా అగ్నిమాప కశాఖ అధికారి

అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు

బాణాసంచా విక్రయాలకు వ్యాపారులు విధిగా అనుమతులు తీసుకోవాలి. మునిసిపల్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖల ద్వారా అనుమతులు పొందాలి. ఎవరైనా అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. బాణాసంచాల విక్రయాల కోసం తాత్కాలికంగా 15రోజుల వరకు మాత్రమే అనుమతులు ఇవ్వనున్నాం. అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం.
● కృష్ణారెడ్డి, సూర్యాపేట జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి



నల్లగొండ శివారులో టపాసుల దుకాణాలు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుదర్శన హోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,64,238 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఏపీ కర్మాగార, కార్మిక, వైద్య బీమా సేవశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కేంద్ర ఆదాయ పన్ను శాఖ డీజీ(పరిశోధన) ఆనంద్ రాజేశ్వరీ బైవారి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు.

ఎస్‌పీఎఫ్ సిబ్బందికి చార్జ్‌మెమోలు జారీ

ఇటీవల యాదగిరిగుట్ట ఆలయంలోకి శునకం ప్రవేశించిన ఘటనపై శనివారం భద్రత సిబ్బందికి చార్జ్‌మెమోలను ఎస్‌పీఎఫ్ సీఐ కే.శేషగిరిరావు జారీచేశారు. తూర్పు రాజగోపురం నుంచి భక్తుల ఆలయంలోకి ప్రవేశించే క్యూలైన్ ద్వారా శునకం ప్రవేశించినప్పటికీ అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ భద్రత సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. అందులో భాగంగా ఎస్ఐ కనకయ్య, హెడ్‌కానిస్టేబుల్ టీ.ఆర్పీ.రెడ్డి, కానిస్టేబుల్ యాదగిరికి చార్జ్‌మెమోలు అందజేశారు.

రేపు బ్యాడ్మింటన్ సెలక్షన్స్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ సెలక్షన్స్ పోటీలను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ గుర్తింపు కార్డుతో పాటు బోనాఫైడ్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ(9948052108)ను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

తుంగతుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న పేలుడు పదార్థాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి సీఐ శ్రీను నాయక్ తెలిపారు. మండలంలోని వెలుగుపల్లి ఆవాస గ్రామమైన మల్లన్నదేవుని గుట్ట వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న 27 జిలెటిన్‌స్టిక్స్, 5 డిటోనేటర్లు, వైర్ బండిల్స్‌ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

ఓపీఎస్‌తోనే ఉద్యోగులకు భద్రత

ఓల్డ్ పెన్షన్ విధానం(ఓపీఎస్)తోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రత, భరోసా ఉంటుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2004లో తెచ్చిన సీపీఎస్(కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం)తో ఉద్యోగులకు న్యాయం జరగదంటున్నారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి రిటైర్ అయ్యాక, పనిచేస్తున్న సమయంలో తీసుకున్న జీతంలో 50శాతం వస్తుందని, ఫలితంగా విశ్రాంత సమయంలో కుటుంబం సజావుగా నడుస్తుందని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ● కోదాడ.

రెండు లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది



ప్రభుత్వం ఎన్నికలకు ముందు సీపీఎస్‌ను, ఓపీఎస్‌గా మార్చుతామని హామీ ఇచ్చింది. హామీ అమలుచేస్తే రెండు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరుతుంది. కొత్త విధానంతో ప్రభుత్వ ఉద్యోగులందరికీ రిటైర్ అయ్యాక జీవనం కొనసాగించటం కష్టంగా ఉంటుంది. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి సీపీఎస్ రద్దుకు సానుకూలంగా ఉండాలి.

● ఆర్. రామనర్సయ్య, ఉపాధ్యాయుడు, కోదాడ

ఓపీఎస్‌తోనే భద్రత ఉంటుంది



నూతన పెన్షన్ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రత లేదు. రిటైర్ అయ్యాక ఇంత వస్తుందన్న గ్యారెంటీ లేదు. ప్రతి ఉద్యోగి అభద్రతా భావంతోనే పనిచేయాల్సి ఉంటుంది. ఇంతా వస్తుందని తెలిస్తే, ఉల్లాసంగా పనిచేయడంతోపాటు, జీవితాన్ని భరోసాతో గడపటానికి వీలుంటుంది.

- భూక్యా సైదానాయక్, ఎంఈవో, కోదాడ

మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు అభినందనీయం



సీపీఎస్ రద్దుపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘం వేయడం అభినందనీయం. సీపీఎస్ రద్దు కోరుతూ ఇప్పటికే 206 సంఘాలు సీఎంను కలిశాయి. ఓపీఎస్‌లో ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయులు లక్ష మంది ఉన్నారని, సీపీఎస్‌లో రెండు లక్షల మంది ఉన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల మాదిరి, తెలంగాణలో సీపీఎస్‌ను రద్దు చేసి, ఉద్యోగులు రిటైర్ అయ్యాక జీవితం సంతోషంగా గడిపేలా చూడాలి.

-మాతంగి ప్రభాకర్, ఉపాధ్యాయుడు, కోదాడ

బెటాలియన్‌లో కొనసాగుతున్న ఆందోళన

» సివిల్ ఎస్ఐను అడ్డుకున్న బెటాలియన్ పోలీసులు » పరామర్శకు వెళ్లిన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల అరెస్ట్ » నల్లగొండ 12వ బెటాలియన్ వద్ద ఘటన



బెటాలియన్ పోలీసులతో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఆందోళనలు యథావిధిగా కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం బెటాలియన్ పోలీసుల సెలవుల విషయంలో కుటుంబ సభ్యులు ధర్నా, రాస్తారోకో చేయడంతో బెటాలియన్ అధికారులు ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం మరోసారి పోలీసులు ఆందోళనకు దిగారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో పాటు ఇటీవల నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తమ కుటుంబాలతో వ్యవహరించిన తీరుపై వారు నిరసన తెలిపారు. సైదాబాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల అమర వీరుల దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 21 బెటాలియన్ పోలీసులు ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ ర్యాలీ సందర్భంగా బెటాలియన్ పోలీసులు అనూహ్యంగా ఆందోళనకు దిగితే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని భావించి సివిల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే రోజున బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. ఆ సమయంలో బందోబస్తులో ఉన్న నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు అనుచితంగా వ్యవహరించారని బెటాలియన్ పోలీసులకు వారి కుటుంబ సభ్యులు వివరించారు. ఈ ఘటనపై బెటాలియన్ పోలీసులు ఆగ్రహంగా ఉన్నారు. అయితే నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు శనివారం మరోమారు బెటాలియన్ వద్దకు బందోబస్తు నిమిత్తం వచ్చారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన బెటాలియన్ పోలీసులు ఒకానొక దశలో రూరల్ ఎస్ఐ సైదాబాబు వైపునకు దూసుకెళ్లారు. దీంతో ఆయన సివిల్ పోలీస్ సిబ్బందితో కలిసి కారులో వెళ్లిపోయారు. అనంతరం బెటాలియన్ అధికారుల సూచనల మేరకు బెటాలియన్ పోలీసులు శాంతించారు. ఈ విషయం తెలిసిన ఎస్పీ శరత్‌చంద్రపవార్ కమాండెంట్ సత్య శ్రీనివాసరావుతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



12వ బెటాలియన్ వద్ద పోలీసుల బందోబస్తు

మాజీ ఎమ్మెల్యే కంచర్ల అరెస్టు

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బెటాలియన్ పోలీసులకు సంఘీభావం తెలపడంతో పాటు పోలీసు కుటుంబాలను పరామర్శించేందుకు తన అనుచరులతో కలిసి బెటాలియన్ వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 1గంట సమయంలో కంచర్ల భూపాల్‌రెడ్డి బెటాలియన్ వద్దకు వెళ్లగానే గేటు వద్ద ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. భూపాల్‌రెడ్డిని తిరిగి వెళ్లిపోవాలని పోలీసులు సూచించినా, ఆయన వెళ్లకపోవడంతో ఆయన్ను కారు నుంచి బలవంతంగా ఎత్తుకొని వెళ్లి పోలీసు వాహనంలో మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బెటాలియన్ వద్ద పోలీసులకు, మాజీ ఎమ్మెల్యే మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మునుగోడు పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. భూపాల్‌రెడ్డి వెంట నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

పోలీసుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తాం : కంచర్ల

మునుగోడు (ఆంధ్రజ్యోతి): బెటాలియన్ పోలీసులు, ప్రజలకు మద్దతుగా పోరాటం చేస్తుందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో పోలీసుల ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీసులు అక్రమ అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలే కాదు... వివిధ శాఖల ఉద్యోగులు సైతం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసుల అరెస్టులకు తాము ఏమాత్రం భయపడబోమని స్పష్టం చేశారు. ప్రాంత అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి నర్సిరెడ్డి, నాయకులు ఈద శరత్‌బాబు, ఐతగోని విజయ్‌గౌడ్, మారగోని అంజయ్య, ఎడవెల్లి సురేష్‌కుమార్, దోటి కర్ణాకర్, ఓరుగంటి శంకర్, గజ్జెల బాలరాజు, యాదయ్య, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పందుల పాపయ్య, అంజి, సుఖేందర్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	210	240
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.135	198	230

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.50
టీఎంసీలు	310.5510
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	29,597
క్రస్ట్ గేట్ల ద్వారా	16,096
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	1,22,234 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	64,866 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.49 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	43,075
అవుట్‌ఫ్లో	44,222 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	2

- మేళ్లచెర్వు, (ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.13
ప్రస్తుత నీటి మట్టం	643.80 అడుగులు
టీఎంసీలు	4.15
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	911.10 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	702.76 క్యూసెక్కులు

- కేతేపల్లి (ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం (ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

- డిండి (ఆంధ్రజ్యోతి)

గోవులను తరలిస్తున్న వాహనాల పట్టివేత

అర్వపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎంను సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఏపీ రాష్ట్రం ఏలూరు నుంచి డీసీఎంలో 64 గోవులతో డీసీఎం బయల్దేరింది. తెలంగాణ సరిహద్దు పులిచింతల వద్ద పోలీసులు పట్టుకుంటున్నారని విజయవాడ నుంచి ఖమ్మం చేరుకొని సూర్యాపేట జిల్లా అర్వపల్లికి వస్తుండగా మార్గ మధ్యలో అర్వపల్లిలో ఆగి ఉన్న లారీని నిద్ర మత్తులో డీసీఎం డ్రైవర్ ఢీకొట్టాడు. నాగర్‌కర్నూల్ జిల్లా చామండి మండలం కమలాపురం గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ కేలోతు కళ్యాణ్ డీసీఎంను నిద్ర మత్తులో లారీని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. కళ్యాణ్ డీసీఎం ముందు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అర్వపల్లి గ్రామస్థులు గంటపాటు శ్రమించి డ్రైవర్‌ను బయటికి తీసి 108వాహనంలో సూర్యాపేటకు ఆస్పత్రికి తరలించారు. అదే డీసీఎంలో బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు క్యాబిన్‌పై నిద్రపోయి ఉన్నారు వారికి ఎలాంటి గాయాలు కాలేదు. 54గోవులను ఏఎస్ఐ రాములు, కానిస్టేబుల్ అన్వర్ ఢీకొన్న లారీలోనే ఎక్కించి హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. 10గోవులను స్థానిక గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



అర్వపల్లి: ఉన్న పశువులు

కబేళాకు తరలిస్తుండగా..

మునగాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోదాడ నుంచి హైద్రాబాద్ కబేలాకు ఆవు దూడలను తరలిస్తున్న డీసీఎం పట్టుబడ్డ మునగాల మండల పరిధిలోని తాడువాయి స్టేజీ విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై పట్టుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కు మార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన మహమ్మద్ గులాం కోదాడలో 13 ఆవు దూడలను డీసీఎంలో కద లకుండా ఒక దానికి ఒకటిగా తాళ్లతో మూతికి, కాళ్లకు కట్టేసి హైదరాబాద్‌లోని కబేలాకు తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీలు చేస్తుండగా అతివేగంతో వెళుతున్న డీసీఎంను అనుమానంతో పోలీసులు తనిఖీ చేయగా అందులో పశువులు ఉన్నాయి. పట్టుబడ్డ డీసీఎంను, డ్రైవర్ మల్లికార్జున్, మహమ్మద్ గులాంలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ పశువులను హైదరాబాద్‌లో ఉన్న గోశాలకు తరలించారు.

దొంగ బాబాను పట్టుకున్న పోలీసులు

● 24గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

ఆత్మకూరు (ఎం) అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) మీ ఇంటికి పట్టిన దోషాన్ని తొలగిస్తానని రైతుకు మాయ మాటలు చెప్పి డబ్బులు కాజేసి పరారైన దొంగబాబాను సంఘటన జరిగిన 24గంటల్లోనే పట్టుకుని పోలీసులు కేసును ఛేదించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ సోలోమన్‌రాజు మాట్లాడుతూ మండలంలోని సింగారం గ్రామానికి చెందిన వాకిటి మల్లారెడ్డి, మణెమ్మ దంపతుల ఇంటికి ఈనెల 25 న బాబావేషధారణలో ఉన్న వ్యక్తి వచ్చాడు. 'మీ ఇంటికి దోషం ఉన్నది, హైద్రాబాద్‌లో ఉంటున్న మీ కొడుకు గండం ఉంది. మీ ఇంటిలో నేను పూజ చేసి దోష నివారణ చేస్తాను' అని అన్నాడు. అందుకు 20వేలు అడగగా రైతు ఒప్పుకోలేదు. చివరికి ఇరువురి మధ్య 3 వేలకు ఒప్పందం కుదరడంతో బాబా రైతు ఇంట్లో పూజ పూర్తిచేశాడు. కానీ పూజ బాగా చేశాను మీకు ఏలాంటి అరిష్టం జరగదు కాబట్టి రూ.10 వేలు ఇవ్వాలని బాబా రైతును ఒత్తిడి చేశాడు. తన సంచిలో నుంచి 3 తాయత్తులు తీసి రైతుకు ఇచ్చి, ఊదు పొగ వేసి, విభూతి లాంటి బొట్టు పెట్టాడు. అదే సమయంలో ఉన్న రైతు ఇంట్లోకి వెళ్లి వడ్లు, పత్తి అమ్మగా వచ్చిన రూ. 38,500 తెచ్చి బాబాకు ఇచ్చాడని సీఐ వివరించాడు. అక్కడి నుంచి బాబా పరారైన కొద్ది సమయానికి తేరుకున్న రైతు తాను మోస పోయిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మూటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో బాబా చేతిలో మోసపోయిన నర్సిరెడ్డి అనే వ్యక్తిని పోలీసులు ఆరా తీశారు. బాబాను నమ్మిన నర్సిరెడ్డి రూ.10 వేలు ఒప్పుకొని అందులో 6 వేలు ఫోన్ పే చేసి, 4 వేలు నగదు ఇచ్చినట్లు తెలిపాడు. నర్సిరెడ్డి ఫోన్ పే చేసిన సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా పోలీసులు నిందితుడి కోసం ఆరాతీయగా, శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్నట్లు గుర్తించి పట్టుకొచ్చినట్లు సీఐ తెలిపారు. నిందితుడు నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం తోపుచెర్ల గ్రామానికి చెందిన షేక్ సత్తార్‌మియాగా గుర్తించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు. పంటలు విక్రయించగా వచ్చిన డబ్బులను ఇంట్లో కాకుండా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని, ఇంటికి తాళాలు వేసి తాళపు చెవును వెంట తీసుకువెళ్లాలని సూచించారు. సాధ్యమైన మేరకు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాల్లో తిరిగే దొంగ బాబాలను నమ్మవద్దని సీఐ మండల ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ సైదులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న సీఐ సోలోమన్‌రాజు

బ్యాటరీ దొంగల పట్టివేత

వలిగొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో పార్కింగ్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీలను చోరీ చేస్తున్న వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి వద్ద నిలిపివేసిన ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను అపహరించిన వ్యక్తులను మండలంలోని నాగారం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఒక కారులో ఇద్దరు వ్యక్తులు ఉండడాన్ని పోలీసులు గమనించారు. వారి వాహనంలో 3 ఎక్సైడ్ బ్యాటరీలు, పానాలు కట్టర్‌లు ఉన్నాయి. వారిని విచారించగా బ్యాటరీలు దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.1.35లక్షల నగదు, మారుతీ కారు, 3 ఎక్సైడ్ బ్యాటరీలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా నిందితులు హైదరాబాద్‌లోని సింగరేణికి కాలనీకి చెందిన చాంద్‌పాషా, కల్యాణ్‌గా గుర్తించారు.

చికిత్స పొందుతూ గీతకార్మికుడి మృతి

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం లింగోజిగూడెంలో తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగోజిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు రమనగోని జంగయ్య(59) శుక్రవారం కల్లుతీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టుపై నుంచి పడ్డాడు. జంగయ్యను హైదరాబాద్‌లోని ప్రైవేటు అసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతి చెం దాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడు..

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. సీఐ తెలిపిన వివరాల ప్రకా రం.. గట్టుప్పల్ మండలం వెల్మకన్నెకు చెంది న మెట్టగల్ల జంగయ్య (55) గత నెల 25న బైకుపై హైదరాబాద్‌కు వెళుతుండగా చౌటుప్పల్ మండలం మల్కాపూరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. జంగయ్యను హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న జంగయ్య శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోవుల వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్ : అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని శనివారం పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి బొలెరో వాహనంలో 10గోవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చివ్వెంల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పొలంలో మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని మున్యానాయక్‌తండాకు శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన సైదా(34)కు అదే గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. రోజుమాదిరిగానే శనివారం సాయంత్రం సుమారు 3:30 సమయంలో పొలానికి నీరు పెట్టేందుకు బావిదగ్గరకు వెళ్లి మోటర్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్కనే ఉన్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. సైదా భార్య లక్ష్మీపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సైదా(ఫైల్)

అనారోగ్యంతో బాలిక..

తొర్రూరు రూరల్(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు ఆర్ఎంపీ వైద్యుడు చికిత్స చేస్తుండగా, బాలిక మృతి చెందిన ఘటన హరిపిరాలలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, బంధువుల కథనం ప్రకారం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామ శివారు ఎనకుంట తండాకు చెందిన బానోతు రమేష్-జ్యోతి దంపతులకు కుమార్తె ఐశ్వర్య(15), కుమారుడు ఉన్నారు. ఐశ్వర్య స్థానిక రావులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. 10 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఐశ్వర్యను రమేష్ శుక్రవారం రాత్రి తండాకు సమీపంలో ఉన్న తొర్రూరు మండలం హరిపిరాల గ్రామ ఆర్ఎంపీ వైద్యుడు సారయ్య వద్దకు తీసుకువచ్చారు. రాత్రి వైద్యం అందిస్తుండగా కడుపు నొప్పి అంటూ వాంతులు చేసుకోవడంతో హుటాహుటిన తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

● ఆరుగురు కూలీలకు గాయాలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టిన సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం శివారు రాంనగర్‌కు వెళ్లే యూ టర్న్ వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన అంతటి సత్యనారాయణ అనే రైతు తన పత్తిచేనులో కూలీలతో పత్తి తీయించాడు. సాయంత్రం కూలీలను ట్రాక్టర్ ట్రాలీలో రాంనగర్‌లో ఉన్న ఓ ఇంటి వద్ద వారిని దింపేందుకు తీసుకెళ్తున్నాడు. రాంనగర్‌లో యూటర్న్ చేస్తుండగా అదే దారిలో వెనుక నుంచి నల్లగొండ వైపునకు పత్తి బేళ్ల లోడుతో వెళ్తున్న లారీ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో కూర్చున్న 10 మంది కూలీల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. వెంటనే 100 సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి గాయపడిన వారిలో కొందరిని 108 అంబులెన్స్‌లో మరికొందరిని ఇదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి కూడా తన కారులో నల్లగొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రాంనగర్ యూ టర్న్ వద్ద ప్రమాదస్థలం వద్ద గుమికూడిన ప్రజలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల, అడ్డుగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య ఉన్న మూసీ నది బ్రిడ్జి మీద జరిగింది. సూర్యాపేటలోని కుడకుడకు చెందిన తుర్పాటి శరణ్(17) ద్విచక్ర వాహనంపై మానాయికుంట గ్రామానికి వెళ్తున్నాడు. మూసీ బ్రిడ్జి మీద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే మూసీ పరివాహక సమ్మేళన స్టేజీ వేస్తున్నారు. అక్కడ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో అటుగా వెళ్తున్న శరణ్ స్టేజీ తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు 108 ఈఎంటీ తిరుమలేష్ తెలిపారు. చరణ్ గురజాల, మానాయికుంట ప్రాంతాల్లో పత్తి ఏరడానికి వచ్చి అతని కుటుంబసభ్యులు స్థానికంగా డేరాలు వేసుకొని నివసిస్తున్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పో లీసులు తెలిపారు.



శరణ్ మృతదేహం

వీటీ కాలనీలో బాలుడు..

చింతపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి బాలుడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలం కాత్రావత్ తండాకు చెందిన బాలుడు (7) అనారోగ్యానికి గురైయ్యాడు. దీంతో తల్లిదండ్రులు చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి బాలుడిని తీసుకువచ్చారు. బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ క్రమంలో బాలుడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కిందపడ్డాడు. వైద్యులు గమనించే చూసే సరికి మృతి చెందినట్లు సమాచారం. మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పశువుల కాపరిపై ఎలుగుబంటి దాడి

● నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలో ఘటన

● క్షతగాత్రుడిది నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామం

నేరేడుగొమ్ము, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో ఓ పశువుల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఇప్పలపల్లి నల్లమల అటవీప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి బద్దెల అంజయ్యగా గుర్తించారు. అంజయ్య కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచరాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెల అంజయ్యకు 80 ఆవులు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం అంజయ్య ఆవుల మేత కోసం నాగర్‌కర్నూల్ జిల్లాకు పశువులను మేపుకుంటూ వలస వెళ్తాడు. ఆగస్టు నెలలో ఆవులను మేతకోసం తోలుకొని అచ్చంపేట, అమ్రాబాద్ ప్రాంతాలకు వెళ్లాడు. పశువులను మేపుతున్న క్రమంలో శనివారం ఉదయం ఓ ఎలుగుబంటి అంజయ్యపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అంజయ్య కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల వారు కర్రలతో వచ్చి కేకలు వేస్తూ ఎలుగుబంటిని తరిమారు. దీంతో ఎలుగుబంటి అడవిలోకి పారిపోయింది. అప్పటికే తీవ్రంగా గాయాలపాలైన అంజయ్యను వాహనంలో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అంజయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వేద వేదాంతతీత అచల మహాసభలు

పెద్దవూర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని ముసలమ్మచెట్టులో గల శివరామదీక్షిత అచల గురుమందిరంలో ఆశ్రమ వ్యవస్థాపకులు జోరీగల బుచ్చిరామ దాసాచార్యుల మండల ఆరాధన కార్యక్రమాలు రెండు రోజుల పాటు జరిగాయి. ఈ కార్యక్రమం శ్రీధర శివరామదీక్షిత అచల సిద్ధాంత అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొనగా సభలో పీఠాధిపతులు తమ పరిపూర్ణ బోధన, సాంఖ్య, తారక, మహావాక్య విచారణలను బోధనలు బోధించి గురుబోధ చేశారు.

CLASSIFIEDS

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వధువు కావలెను

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను, 1, 2, ఆర్యవైశ్య అబ్బాయి 36, M.Ed., ప్రైవేట్ లెక్చరర్ 20+20=40 వేలు, ఆస్తి 1 కోటి, M9HB, మునుగోడు రోడ్డు, నల్లగొండ. సెల్: 9121325068.

AJY_161976

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/-Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413365 9985413656
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 9985410384

'తెల్ల'బోతున్న రైతులు


చందంపేట మండలంలో పత్తి చేలలో పత్తి తీస్తున్న రైతులు

- తెల్లబంగారానికి దళారుల బెడద
- దేవరకొండ డివిజన్‌లో పత్తి రైతుల ఇబ్బందులు
- తూకాలలో మోసం
- తేమ పేరుతో తక్కువ ధరకు కొనుగోలు
- పట్టించుకోని అధికారులు

దేవరకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, కష్టపడి పండించినా గిట్టుబాటు ధర గగనంగా మారింది. విధిలేని పరిస్థితిలో పత్తి రైతులు ప్రైవేట్ వ్యాపారుల మాటలు నమ్మి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినా తేమపేరుతో ఆంక్షలు విధిస్తుండటంతో విధిలేని పరిస్థితిలో రైతులు పత్తిని వ్యాపారులు చెప్పిన రేటుకే విక్రయించే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో దేవరకొండ డివిజన్‌లో 1.50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేశారు. కానీ ఆగస్టు నెలలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పత్తిచేలకు ఎర్ర తెగులురావడంతో దిగుబడి తగ్గింది. పత్తి తీసే సమయానికి తుపాన్‌తో కూడిన వర్షాలు కురుస్తుండటంతో పత్తి తడిసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిని ఆరబెట్టి విక్రయాలు చేద్దామంటే సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో ఆంక్షలు విధిస్తున్నారు. విధిలేని పరిస్థితిలో దళారీలు క్వింటాల్‌కు రూ.5500 నుంచి 6 వేల వరకు విక్రయిస్తున్నారు. తూకాల్లోనూ వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తూకాల్లోనూ మోసం

పత్తి రైతులను తూకాల్లోనూ వ్యాపారులు మోసం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తూనికలు, కొలతలు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో ధ్రువీకరణ చేయని తూకాల యంత్రాలను వాడుతూ మోసం చేస్తున్నారు. ఇటీవల తూనికల, కొలతలశాఖ జిల్లా అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో నాంపల్లి, చండూరు, మునుగోడు మండలాలోని పలు గ్రామాల్లోని తనిఖీలు నిర్వహించి ధ్రువీకరించని క్వాంటా బాట్లు, ధ్రువీకరణ పత్రాలులేని తూకం యంత్రాలు వాడుతున్న నలుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి. దేవరకొండ డివిజన్‌లో గిరిజన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి వారు నిర్ణయించిన ధరకే పత్తిని కొనుగోలు చేసి మోసాలకు గురి చేస్తున్నారు. ఎకరాకు రూ. 20 వేల వరకు పెట్టుబడులు పెట్టామని ఆ పంట ఎకరాకు 5 నుంచి 10 క్వింటాల్‌లు కూడా చేతికి రావడంలేదని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర ఇస్తున్నా సీసీఐ అధికారులు తేమపేరుతో ఆంక్షలు విధిస్తూ కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. విధిలేని పరిస్థితిలో వ్యాపారులకే విక్రయిస్తున్నామని వారు చెబుతున్నారు. తూనికలు, కొలతలశాఖ, పోలీస్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


నాంపల్లి మండలంలో తూకాలలో మోసాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సీసీఐ కేంద్రాల ఏర్పాటు ...

దేవరకొండ డివిజన్‌లోని చింతపల్లిలో నాలుగు, పీఏపల్లిలో మూడు, కొండమల్లేపల్లిలో ఒకటి, డిండిలో ఒకటి, గుర్రంపోడులో ఒకటి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాని సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో ఆంక్షలు విధిస్తుండటంతో చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని రైతులు విధిలేని పరిస్థితిలో దళారులకే పత్తిని విక్రయిస్తున్నారు.

పత్తికి గిట్టుబాటు ధర రావడం లేదు


తనకున్న ఎకరంతో పాటు పది ఎకరాలు కౌలుకు తీసుకొని ఈ ఏడాది రెండు లక్షల వరకు ప్రైవేట్ అప్పులు చేసి పత్తిపంట సాగు చేశాను. వర్షాలు సకాలంలో లేకపోవడం, అధిక వర్షాల కారణంగా పంట దిగుబడి తగ్గింది. దీనికితోడు తెగుళ్లు, కూలీల కొరత ఏర్పడింది. ఎకరాకు 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా దిగుబడి 4 క్వింటాళ్లకు పడిపోయింది. పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు.

- జల్లెల శీను, కౌలు రైతు, చందంపేట

ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేయాలి


సీసీఐ కేంద్రాల్లో ఆంక్షలు విధించకుండా పత్తిని కొనుగోలు చేయాలి. తేమపేరుతో ఆంక్షలు విధిస్తుండం తో రైతులు విధిలేని పరిస్థితిలో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దళారీలు రైతులను మోసం చేస్తున్నారు. అధికారులు దాడులు చేసి దళారులపై చర్యలు తీసుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- సుదర్శన్‌రెడ్డి, సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి


పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించాలి. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7521 మద్దతు ధర కల్పిస్తుంది. తేమలేకుండా ఆరబెట్టుకొని పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలి. రైతుల ఖాతాలలోనే డబ్బులు జమ అవుతాయి. దళారులను నమ్మవద్దు.

- శ్రీరాములు, ఆర్డీవో, దేవరకొండ

నేడు రైతుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అడ్డగూడూరు మండలం మానాయికుంటలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే నియోజకవర్గ స్థాయి మూసీ పరివాహక రైతుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దండ అశోక్‌రెడ్డి, నోముల జనార్ధన్, నోముల రవికుమార్, వడ్లకొండ పరమేష్ కోరారు. మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమ్మేళనానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

రామగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న మునిసిపల్ సాధారణ సమావేశం మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతంగా చేయాలని ఆయన కోరారు.

ఉదయ సముద్రాన్ని నీటితో నింపాలి

నల్లగొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉదయ సముద్రం ప్రాజెక్టును నీటితో పూర్తి స్థాయిలో నింపాలని టీడీపీ నాయకుడు గుండు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండినా ఉదయసముద్రం నింపడం లేదన్నారు. సమావేశంలో కూరెళ్ల విజయ్‌కుమార్, రసూల్, నాగరాజు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

నిడమనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అ కాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. పంటలు చేతికి వచ్చే దశలో కురిసిన వర్షాల వల్ల అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ కమిటీల మాదిరిగా ఉండకూడదన్నారు. అనంతరం వేంపాడ్ సీపీఎం కన్వీనర్‌గా వెంపటి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు కందుకూరి కోటేష్, చంద్రశేఖర్, శేఖర్, రమేష్, నాగరాజు, యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

రైతుపై చేయిచేసుకున్న ఏఎస్ఐ

• సోషల్‌మీడియాలో వీడియో • వైరల్ ఆలస్యంగా వెలుగులోకి...

మునుగోడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో రైతుపై ఓ ఏఎస్ఐ చేయిచుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మునుగోడులో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం వీడియో సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో శనివారం వైరల్ అయ్యింది. వివరాల్లోకి వెళితే... మునుగోడు మండల కేంద్రానికి చెందిన రైతు కొమ్ము ముత్యాలుకు తన వ్యవసాయ భూమి పక్క రైతుతో హద్దుల వివాదం ఉంది. కొద్దికాలంగా వీరిమధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. రైతు ముత్యాలుపై సరిహద్దు రైతు సెప్టెంబరు 30వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్ఐ కోటిసింగ్ మేకలు కాస్తున్న ముత్యాలు వద్దకు వచ్చి స్టేషన్‌కు రావాలని ఆదేశించారు. మేకలు కాస్తున్నానని, తర్వాత వస్తానని చెప్పినా వినిపించుకోలేదు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఏఎస్ఐ కోటిసింగ్ అకారణంగా చేయిచేసుకున్నారని ఆరోపిస్తూ ఈ నెల 17వ తేదీన ఎస్పీ కార్యాలయంలో ముత్యాలు ఫిర్యాదు చేశాడు. కాగా, ఏఎస్ఐ రైతు ముత్యాలుపై చేయిచేసుకున్న ఘటనను బాధిత రైతు కుటుంబ సభ్యులు వీడియో తీశారు. చేయిచేసుకున్న వ్యవహారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్ అయ్యింది. ఈ ఘటనపై విచారణ చేసి జిల్లా ఎస్పీకి నివేదిక పంపనున్నట్లు చండూరు సీఐ వెంకటయ్య తెలిపారు.

మూసీ డ్యాం రక్షణ గోడ నుంచి నీటి లీకేజీలు


క్రస్టుగేట్ల పక్కన గల గోడ నుంచి భారీగా లీకవుతున్న నీరు

కేతేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరం నుంచి గత జూన్ నెల నుంచి నిరంతరాయంగా వస్తున్న వరద నీటితో ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకుని నిండుకుండలా ఉంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 645అడుగులు(4.46టీఎంసీలు)కాగా ప్రస్తుతం 643.80అడుగులు(4.15టీఎంసీలు)గా ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ప్రధాన డ్యాంకు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించారు. ఈ రక్షణ గోడ మీదుగా ఉన్న రహదారిపై నుంచి వాహనా లు, మనుషులు రాకపోకలు సాగిస్తుంటారు. జలాశయంలోని నీటికి రక్షణగా ఉండాల్సిన గోడకు క్రస్టుగేట్ల వైపు పగుళ్లు వచ్చి, బుంగలు పడ్డాయి. ఈ పగుళ్లు, బుంగల ద్వారా కొన్నాళ్లుగా నీరు లీకవుతుంది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో ప్రాజెక్టు నుంచి ఎంతో విలువైన నీరు వృథాగా పోతుంది. మరమ్మతులు లేకపోవడంతో ఇవి మరింత పెద్దవయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున అధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు చేసి విలువైన నీటి వృథాను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు సహకరిస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముందస్తు ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న పీఆర్వోలపై సహకరిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన స మావేశంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలు అప్పుడే ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల దగ్గరకు వెళ్లి ఇబ్బందుల కు గురి చేయడం జరగుతుందన్నారు. డొనేషన్ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నాయని అన్నారు. ఆయా విద్యాసంస్థల గుర్తింపు ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే డీఈవో, కలెక్టర్ ఆ విద్యాసంస్థలకు ముందస్తు అడ్మిషన్లు నిలిపివేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జిల్లాలో స హకరిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల ఎదుట ఎస్ఎఫ్ఐ ప్రత్యక్షమైన ఆందోళనలకు పూ నుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, ఇద్దిరాములు, చరణ్, రాకేష్, రవి, సంతోష్, సాయితేజ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజ్యాధికారం కల్పించాలి

• బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్

నల్లగొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో దివ్యాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం కల్పించేంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి అధ్యక్షతన నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ నాయకులు దివ్యాంగులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటూ ఏళ్ల నుంచి వారి సంక్షేమాన్ని విస్మరించి అడుగడుగున వివక్ష ప్రదర్శించారన్నారు. చట్టసభల్లో దివ్యాంగులకు రాజ్యాధికారం సాధించడమే సంఘం పని చేస్తుందని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య, బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, నాయకురాలు గుడిపల్లి సుమతి, శానమోని అల్వాల్, తౌటి మల్లయ్య, ముత్తయ్య, పోతురాజు సుధీర్, పాలోజు వెంకటనారాయణ, వెంకన్న, సైదులు పాల్గొన్నారు

బీసీ గర్జన సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు తమ్మడబోయిన అర్జున్, మారం శ్రీనివాస్, కోలా సైదులు కోరారు. జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు బీసీ గర్జన సభ ప్రచార రథాలను ప్రారంభించి మాట్లాడారు. జనాభాలో 55శాతం ఉన్న బీసీలు ఎన్నో అణిచివేతలకు గురవుతున్నారని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, తిరుమలగిరి అశోక్, ఈశ్వరాచారి, జయరాజ్, మహేష్‌గౌడ్, రాంబాబు, రాములు పాల్గొన్నారు.

అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించాలి

చిట్యాల, కేతేపల్లి, కట్టంగూరు, కనగల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. చిట్యాలలో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, వాటి ద్వారా 2400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సన్నధాన్యం కొనుగోళ్ల కోసం 80 కేంద్రాల్లో సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, ఆర్ఐ ప్రవీణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాములలో పీఏసీఎస్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం రాశులు, తేమశాతం, కొనుగోళ్లను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 17శాతం తేమ కలిగిన ధాన్యం కొనుగోలు చేసి నిర్దేశిత గోదాములకు తరలించాలని ఆదేశించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఆయన డీటీ సీఎస్ ఆర్.జ్యోతి, కేంద్రం ఇన్‌చార్జి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈసీఎస్‌వో వెంకటేశ్వర్లు పరిశీలించారు. రైతులు ఐకేపీ కేంద్రాలను ఉపయోగించుకొని మద్దతు ధరను పొందాలని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం పస్పరాజు సైదులు, డీటీసీఎస్ జ్యోతి, సీసీ కారింగ్ శంకర్, కొనుగోలు కమిటీ సభ్యులు జక్కలి భవాని, లక్ష్మి, రెహానాబేగం తదితరులు పాల్గొన్నారు.


అయిటిపాములలోని ఐకేపీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

● కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామంలో ఏర్పాటు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పద్మ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి వసతిని కల్పించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ జ్యోతిష్న, ఏఈవో విజయలక్ష్మి, ఏపీఎం హరి, సీసీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. : ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రంతో వస్తే తాను చర్చకు సిద్ధమేనని ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్ విసిరారు. నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్‌కు విడుదలవుతున్న కృష్ణా జలాలకు శనివారం ఆయన జలహారతులు ఇచ్చి పసుపు కుంకుమ పూలను సమర్పించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణా జలాలను ఇక్కడి రైతులకు, ప్రజలకు అంకితమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి విడతలో 50వేల ఎకరాలకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ విలువలను బీఆర్ఎస్ పార్టీ దిగజార్చిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను ఉద్దేశించి మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, గాదరి కిషోర్‌లు విమర్శ లు చేయడం హాస్యాస్పదమన్నారు. అవే మాటలతో మిమ్మల్ని అవమానపర్చేందుకు మాకు సంస్కారం అడ్డొస్తుందని వీరేశం వ్యాఖ్యానించారు. కిశోర్ ఇంకా తాను ఎమ్మెల్యేనన్న భ్రమలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. ద మ్ముంటే మీరు చర్చకు రావాల ని మీతో చర్చకు మంత్రులు రానవసరంలేదని నేను సరిపోతానని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊ శయ్య, పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, జెరిపోతుల భరత్, బింగి మహేష్, గడ్డం పశుపతి, బొడిగె స్వామి, ఎస్కే సమద్, రాధారపు బిక్షపతి, రేగట్టె నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీవెల్లెంలలో కృష్ణానీటికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

బ్రాహ్మణభవన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలి

దేవరకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో బ్రాహ్మణభవన్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని బ్రాహ్మణ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ కోరారు. దేవరకొండ మద్దెలమ్మ దేవాలయంలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సంఘం నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.10లక్షలు కేటాయించిందన్నారు. దీపావళి పండగను ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీన గురువారం రోజున నివాళిలు ఉంటాయన్నారు. ఈ సంవత్సరం స్వాతికార్తె వచ్చినందున కొత్త నోములు ఉన్నాయని ఆయన తెలిపారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు సురభి కృష్ణమూర్తిశర్మ, వైద్యుల కృష్ణమూర్తిశర్మ, గంప శశికుమార్‌శర్మ, ఉప్పల శ్రీనివాస్‌శర్మ, సురభి ప్రభాకర్‌శర్మ, సత్యనారాయణశర్మ, చరణ్, నరహరిరావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాటం : సీపీఐ

నల్లగొండరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దోపిడీ లేని వ్యవస్థ కోసం సమ సమాజ స్థాపన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడిందని ఆ పార్టీ జాతీయ నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మగ్దూం భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయాలని, ఫ్లోరైడ్ మహమ్మారి నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని సీపీఐ అనేక దపాలుగా పోరాటాలు నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో డిసెంబరు 30వ తేదీన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, యాదగిరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో అవకాశం కల్పించాలి

నల్లగొండరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసే ఇందిరమ్మ కమిటీలలో అందరికీ అవకాశం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. నల్లగొండ మండలంలోని దొనకల్లు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో అన్ని పార్టీల, అన్ని కులాల వారికి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డులు, ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు, నాయకులు మంగదుల యాదయ్య మంగాదుర్ల కృష్ణయ్య వెంకన్న, కృష్ణయ్య, నాగరాజు, సాంబయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిని విమర్శిస్తే సహించేది లేదు'

నల్లగొండటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విషయంలో అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే తన నోటిని అదుపులో ఉండుకొని మాట్లాడాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే తన స్థాయికి మరిచి మంత్రి వెంకట్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడటాన్ని యావత్ సమాజం ఖండించాలని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ లీగల్ అడ్వజర్ నజీరుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి పొడిశెట్టి అరవింద్‌గౌడ్, నాయకులు జెర్రిపోతుల లింగయ్యగౌడ్, తంతానపల్లి దయాకర్, చంద్రశేఖర్, రాయల నాసరయ్య, ఈశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

చింతపల్లి: చింతపల్లిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ రమాకంత్‌శర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడా మైదానం ఏర్పాటు చేయడం వల్ల యువత సన్మార్గంలో నడిచే అవకాశం ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల రక్తదానం

మాడ్గులపల్లి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతకాయల సతీష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు రక్తదానం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు రక్షణగా ఉంటారని అన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ఉపేందర్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు అమలు చేయాలి '

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, గిరి, సోములు, రవిబాబు, వెంకన్న పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

మిర్యాలగూడ టౌన్: అకాలవర్షంతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. శనివారం వ్యవసాయశాఖ ఉపసంచాలకుడు విజయ్‌కుమార్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. రైతులు నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నేతలు కల్వచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్‌గౌడ్, వీటీ పాల్గొన్నారు.

రోగులకు మందుల పంపిణీ

కనగల్: మండల కేంద్రమైన కనగల్ ఎక్స్‌రోడ్డులో వైఆర్‌జీ కేర్ లింక్ సంస్థ నల్లగొండ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు షుగర్, హెచ్ఐవీ తదితర టెస్టులను నిర్వహించారు. అవసరమైన మందులను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ ఎస్ఎస్‌కె మేనేజర్ రమేష్, వైఆర్‌జీ కేర్ లింక్ సంస్థ సభ్యుడు సింగపంగ వెంకన్న, అంగన్‌వాడీ టీచర్ రాజ్యం, ఏఎన్ఎం గీతారాణి, రజిత పాల్గొన్నారు.

గురుకులంలో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో టీజీటీ మ్యాథ్స్ టీజీటీ హిందీ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి పార్ట్‌టైం ఉద్యోగానికి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగ్తానాయక్ శనివారం తెలిపారు. అర్హులైన పురుష అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు పాఠశాలలో తమ ధ్రువీకరణ పత్రాల జీరాక్స్‌లను అందించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులకు దరఖాస్తుల స్వీకరణ

డిండి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీవో జయరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పట్టా భూముల్లో వివిధ రకాల పనులకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ పనులు ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కొండమల్లేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల పరిధిలోని జోగ్యతండా సమీపంలోని సాలిడార్ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అంశంపై శనివారం అవగాహన కల్పిచారు. ముద్ర లోను, విశ్వకర్మ, యువజన స్కీం, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ క్రైమ్, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కర్, చంద్రయ్య, విజయలక్ష్మి, అంకులమ్మ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

నకిరేకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):నకిరేకల్ మూసీ రోడ్డులోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మందిరం ఆవరణలో దేవతా మూర్తుల కల్యాణంలో భాగంగా శనివారం శ్రీ సీతారామ కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావు, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రత్నాకర్, పెద్దపాడుకు చెందిన బ్రహ్మశ్రీ, సూర్యనారాయణ, సత్యసాయిబాబా మందిరం అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాన్ని పారంభించాలి

నకిరేకల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. మండలంలోని కడపర్తిలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీసీఐ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్జి రామచంద్రయ్య, భూపతి వెంకన్న, సీపీఎం నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు వంటిపాక వెంకటేశ్వర్లు, మర్రి వెంకటయ్య, కొప్పుల అంజయ్య, రాచకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ఎస్ మండల అధ్యక్షుడిగా సీతారాంనాయక్

పెద్దవూర, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) మండల అధ్యక్షుడిగా మండలానికి చెందిన రమావత్ సీతారాంనాయక్ ఎన్నికయ్యారు. నాగార్జునసాగర్‌లో నిర్వహించిన సమావేశంలో సీతారాంనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.